ఆరోగ్యానికి భరోసా..


తాత్కాలిక భవనంలో నడుస్తున్న పీహెచ్‌సీ

- లింగాలవలస కొత్త పీహెచ్‌సీలో అందుబాటులోకి వచ్చిన వైద్య సేవలు
- ప్రస్తుతం తాత్కాలిక భవనంలో నిర్వాహణ

టెక్కలి: పల్లె ముంగిటకే మెరుగైన వైద్యం అందాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన ఆచరణలోకి వచ్చింది. శివారు గ్రామాలకు సైతం మెరుగైన వైద్య సేవలు చేరువవుతున్నాయి. టెక్కలి మండలం శివారు పంచాయతీ లింగాలవలసలో 30 ఏళ్లుగా ఎదురుచూస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కల ఎట్టకేలకు నెరవేరింది. మండలానికి శివారులో ఉన్న లింగాలవలసతో పాటు చుట్టు పక్కల గిరిజన గ్రామాలకు అనుకూలంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేయాలని దశాబ్దాలుగా ఆయా పంచాయతీ ప్రజల కోరిక ఇప్పుడు నెరవేరింది. లింగాలవలస పంచాయతీ కేంద్రంలోని తాత్కాలిక భవనంలో ఏర్పాటు చేసిన పీహెచ్‌సీలో వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో ప్రజలంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


లింగాలవలసలో కొత్తగా ఏర్పాటు చేసిన పీహెచ్‌సీలో వైద్య సేవలు అందజేస్తున్న సిబ్బంది

నెరవేరిన 30 ఏళ్ల నాటి కల..

టెక్కలి-పాతపట్నం మార్గంలో మండలానికి శివారు ప్రాంతంలో ఉన్న లింగాలవలసలో చుట్టు పక్కల గిరిజన గ్రామాలకు అనుకూలంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేయాలని సుమారు 30 ఏళ్లుగా ఈ ప్రాంతీయులు కోరుతున్నారు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా మెట్టూరు, తురకపేట, పురుషోత్తపురం, కల్లేపల్లితో పాటు లింగాలవలసకు కొత్తగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేశారు. ప్రస్తుతానికి గ్రామంలోని పంచాయతీ భవనంలో తాత్కాలికంగా పీహెచ్‌సీని ఏర్పాటు చేసి వైద్య సేవలు అందజేస్తున్నారు. ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్ నర్స్‌లు, ఎంఎన్‌ఓను నియమించారు. రోజుకు 30 నుంచి 50 మంది వరకు ఇక్కడ వైద్య సేవలు పొందుతున్నారు. ఈ పీహెచ్‌సీకి అనుసంధానంగా సుమారు 23 గ్రామాల ప్రజలు వైద్య సేవలు అందుకుంటున్నారు. వీరిలో గిరిజన గ్రామాల ప్రజలు అత్యధికంగా ఉన్నారు.

రూ. 2.30 కోట్లతో కొత్త భవనాలు

లింగాలవలసలోని పీహెచ్‌సీకి పక్కా భవనాలు నిర్మించడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. గ్రామానికి ఆనుకుని సుమారు ఒక ఎకరా స్థలాన్ని కేటాయించారు. ఇందులో రూ.2 కోట్ల 30 లక్షలతో భవనాలు నిర్మాణం చేయడానికి ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. కొద్ది రోజుల్లో పనులు ప్రారంభం కానున్నాయి.

రాఘవరావు కుటుంబం కృషి



లింగాలవలసలో పీహెచ్‌సీ ఏర్పాటు విషయంలో మాజీ ఎంపీపీ సంపతిరావు రాఘవరావు, ఆమె కుమార్తె దువ్వాడ వాణి ఎంతో కృషి చేశారు. గతంలో వైద్యం అందాలంటే ఎన్నో ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు అటువంటి ఇబ్బందులు లేకుండా చుట్టు పక్కల ప్రాంతాల వారికి ఎంతో అనుకూలంగా ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఉంది. ఇక్కడ సిబ్బంది సైతం చక్కగా వైద్య సేవలు అందజేస్తున్నారు.

–ఆర్.వెంకటప్పారావు, విశ్రాంత ఉపాధ్యాయుడు, కూర్మనాథపురం

ఇబ్బందులు తప్పాయి



అత్యవసర సమయాల్లో వైద్యం అందాలంటే మారుమూల గిరిజన ప్రాంతాల నుంచి ఎన్నో ఇబ్బందులు పడుతూ పట్టణాలకు వెళ్లేవాళ్లం. ఇప్పుడు అటువంటి ఇబ్బందులు తప్పాయి. మా నాన్నకు వైద్యం కోసం లింగాలవలస పీహెచ్‌సీకు తీసుకువచ్చాను. ఇక్కడ బాగానే వైద్యం చేశారు.

–జన్ని చలపతిరావు, గిరిజనుడు, సన్యాసిపేట

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



మండలానికి శివారుగా ఉన్న మా ప్రాంతంలో పీహెచ్‌సీ మంజూరుకు సహకరించిన అధికార యంత్రాంగానికి కృతజ్ఞతలు. అలాగే ప్రజారోగ్యం పట్ల ఎంతో చిత్తశుద్ధితో పాలన అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనతో మా ప్రాంతానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వచ్చింది. మా పంచాయతీ ప్రజలంతా ముఖ్యమంత్రి జగన్‌కు రుణపడి ఉంటాం.

–సంపతిరావు లక్ష్మి, సర్పంచ్, లింగాలవలస

క్లుప్తంగా

శివ స్వాముల బోల్‌బోమ్ యాత్ర


శివాలయంలో పూజలు చేస్తున్న శివ స్వాములు

ఇచ్ఛాపురం రూరల్: ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామం బి.నౌగాం గ్రామానికి చెందిన 40 మంది శివ స్వాములు సోమవారం లొద్దపుట్టి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోల్‌బోమ్ శివ మాలధారణ భక్తులు గురుస్వామి కృష్ణచంద్రరౌళో ఆధ్వర్యంలో స్థానిక బహుదనదిలో స్నానమాచరించి ప్రత్యేకంగా తయారు చేసిన కావడిలో మట్టి కలశాసాలలో బహుదా జలాలలను నింపి యాత్రగా శివలింగంపై జలాభిషేకం చేశారు. రాఖీ పౌర్ణమి వరకు నెల రోజుల పాటు స్త్రీ, పురుషులు, చిన్నారులు బోల్‌బోమ్ శివమాల ధారణలో ఉంటూ ఆంధ్రా, ఒడిశా ప్రాంతాల్లోని ప్రఖ్యాత చెందిన శివాలయాల్లో గడుపుతామని గురుస్వామి తెలిపారు.

కృష్ణదాస్‌కు ఎమ్మెల్సీ శుభాకాంక్షలు


కృష్ణదాస్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్సీ రామారావు

కవిటి: శ్రీకాకుళం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడుగా..నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ శ్రీకాకుళంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నర్తు రామారావు కృష్ణదాస్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.


కాలనీ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్‌కు వినతి


కలెక్టర్‌కు వినతి అందజేస్తున్న దువ్వాడ వాణి

టెక్కలి: మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు కోసం భూములిచ్చిన నిర్వాసితులకు కేటాయించిన కాలనీ పనులు వేగవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను తన కార్యాలయంలో సోమవారం కలిసి విజ్ఞప్తి చేశారు. అలాగే టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల పరిధిలోని పలు ప్రధాన సమస్యలను కూడా విన్నవించారు. పోర్టు నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించి న్యాయం జరిగేలా చూడాలని, పోర్టు పనుల్లో నిరుద్యోగ యువతకు ఉపాధి కలిగేలా చూడాలని, నిర్వాసితుల త్యాగాలకు అనుగుణంగా వారికి లబ్ధి చేకూర్చాలని కోరారు. ఈమె వెంట కోటబొమ్మాళి పీఏసీఎస్ చైర్‌పర్సన్ బాడాన మురళి, నాయకులు ఎం.భాస్కర్‌రెడ్డి, ఎన్.అప్పలస్వామి, ఆర్.లక్ష్మణ, వి.ఆదినారాయణ, హెచ్.దాలయ్య ఉన్నారు.

గుడ్..బ్యాడ్ టచ్‌పై అవగాహన అవసరం

- జూనియర్ సివిల్ జడ్జి తేజ చక్రవర్తి మల్ల


మాట్లాడుతున్న జడ్జి తేజ చక్రవర్తి మల్ల

టెక్కలి: ఎదుటి వారి ప్రవర్తనలో స్వభావాన్ని తెలుసుకునే విధంగా ఆడ పిల్లలు 'గుడ్.. బ్యాడ్ టచ్' పై అవగాహన కలిగి ఉండాలని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి ఎస్.హెచ్.ఆర్. తేజ చకవర్తి మల్ల అన్నారు. గుడ్..బ్యాడ్ టచ్ అంశంపై సోమవారం టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొంత మంది సన్నిహితులు ఆడ పిల్లలను దగ్గరకు చేర్చుకుని లైంగిక వేధింపులకు పాల్పడే అవకాశాలు ఉన్నాయని అటువంటి వేధింపులకు గురి కాకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.వివేకానంద, ఎంఈవో డి.తులసీరెడ్డి, న్యాయవాదులు కె.వెంకట్రావు, మధుబాబు, ఎస్సై ఎల్.రామకృష్ణ, ఉపాధ్యాయుడు ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం

కంచిలి: గ్రామీణ ప్రాంతాల్లో అన్ని రకాల మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభం, శంకుస్థాపనలను ఆయన సోమవారం చేపట్టారు. తలతంపర పంచాయతీ పరిధి లండపుట్టుగలో గడప గడపకు నిధులు రూ. 5 లక్షలతో విశ్రాంతి మండపం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మఠం సరియాపల్లిలో చెరువుకు సిమెంటు మెట్లు నిర్మాణాన్ని 15వ ఆర్థిక సంఘం నిధులతో పూర్తిచేసిన వాటిని, అదే పంచాయతీలో శివాలయం వద్ద 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 1.5 లక్షలతో బోరు ఏర్పాటుకు భూమిపూజ చేశారు. తలతంపర, మఠంసరియాపల్లి సర్పంచ్‌లు డాక్టర్ జగబంధు దొళాయి, కొణపల సురేష్, ఎంపీటీసీ సభ్యులు బృందావన్‌సాహు, బుడ్డెపు విశ్వనాథం పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


సాయిరాజ్‌ను సత్కరిస్తున్న నాయకులు

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతం, వచ్చే ఎన్నికల్లో గెలుపు కోసం పనిచేయాలని నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు. పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడుగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తిప్పన నాగరాజురెడ్డి, ఎంపీపీ బోర పుష్పలతో పాటు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం శ్రీకాకుళంలోని జెడ్పీ కార్యాలయంలో సాయిరాజ్‌ను కలిసి దుశ్శాలువతో సత్కరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సాయిరాజ్ సూచించారు. మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ ఆశి పురుషోత్తమరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ పిట్ట ఆనంద్, సర్పంచ్‌లు కారంగి త్రినాథ్‌రెడ్డి, పాతిర్ల రాజశేఖరరెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బాగ మోహనరావు ఉన్నారు.

మంచినీటి కల్పనే ధ్యేయం

నందిగాం: ప్రతి ఇంటికి మంచినీరు అందించడమే ధ్యేయంగా జలజీవన్‌మిషన్ పథకాన్ని రూపొందించారని కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. దీనబంధుపురం, తమలాపురం గ్రామాల్లో స్థానిక సర్పంచ్ మడపాల సంజీవరావు ఆధ్వర్యంలో ఇంటింటికి మంచినీటి కల్పన పనులకు ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తితో కలిసి తిలక్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ఇంటింటికి కుళాయిల ద్వారా మంచినీటిని అందించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో కురమాన బాలక్రిష్ణారావు, ఆర్.కూర్మారావు, నౌగాం ఎంపీటీసీ సభ్యుడు బార్నాన బాలక్రిష్ణ, అంబోడి విష్ణు, బొమ్మాళి గున్నయ్య, తమిరె రాజు, బొరుభద్ర సోమేశ్వరరావు, బార్నాన బాబూరావు, పడ్డ బుల్లినాయుడు,సచివాయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.


దీనబంధుపురంలో కుళాయి పనులకు శంకుస్థాపన చేస్తున్న తిలక్

రాష్ట్రస్థాయి ఉత్తమ రైతుకు సత్కారం


నాగరాజు పండా, సంధ్యారాణిలను సత్కరిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: వరిసాగులో నూతన ఆవిష్కరణకు కృషి చేసి రాష్ట్రస్థాయిలో ఉత్తమ రైతుగా ఎంపికైన పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన నాగరాజు పండాను అధికారులు పలాస మండల వ్యవసాయ కార్యాలయంలో సోమవారం ఘనంగా సత్కరించారు. కిసాన్ మహోత్సవం 2023లో భాగంగా ఏరువాక ఫౌండేషన్ వారు రాష్ట్రస్థాయిలో వరి విభాగంలో నాగరాజును ఉత్తమ ఉత్తమ రైతుగా ఎంపిక చేశారు. కృషి విజ్ఞాన కేంద్రం, శాస్త్రవేత్తల సూచనలు మేరకు వరి పంటలో చిరుసంచుల విత్తనములు ట్రైల్స్‌లో వేసి మన ప్రాంతానికి అనువైన వంగడాలను రైతులకు పరిచయం చేయడం, వాటి ఫలితాలను శాస్త్రవేత్తలకు తెలియజేయడంతో నాగరాజుకు అవార్డు దక్కింది. అదేవిధంగా కైజోల ఆర్‌బీకే ఇన్‌చార్జి, హార్టికల్చర్ అసిస్టెంట్ ఎం సంధ్యారాణికి ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్‌గా ప్రమోషన్ రావడంతో ఆమెను కూడా సత్కరించారు. పలాస రూరల్ అసిస్టెంట్ అగ్రికల్చరల్ డైరెక్టర్ ఎల్.వి.మధు, మండల వ్యవసాయ అధికారి కె.పోలారావు, మండల హార్టికల్చర్ ఆఫీసర్ శంకర్‌దాస్, ఏవో పాపారావు పాల్గొన్నారు.

2న మండల సర్వసభ్య సమావేశం

కోటబొమ్మాళి: మండల సర్వసభ్య సమావేశాన్ని వచ్చే నెల రెండో తేదీన నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్ సోమవారం తెలిపారు. ఎంపీపీ అధ్యక్షత జరగనున్న సమావేశానికి సభ్యులు, అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

పథకాలు అందలేదనే మాట రాకూడదు


మాట్లాడుతున్న దువ్వాడ వాణి

- సమన్వయకర్త దువ్వాడ వాణి

టెక్కలి: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను చేరువ చేయాలని, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎక్కడా లబ్ధిదారుల నుంచి సంక్షేమ పథకాలు అందలేదనే మాట రాకుండా చూడాలని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. తొలుసూరుపల్లి గ్రామ సచివాలయం పరిధిలో తొలుసూరుపల్లి, భగవాన్‌పురం, చింతలగార, ధర్మనీలాపురం, జయకృష్ణాపురం, మున్సబుపేట గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయాలని.. ఎక్కడైనా సాంకేతిక కారణాలతో పథకాలు అందకపోతే తక్షణమే వారికి పథకాలు అందే విధంగా ప్రత్యేకంగా బాధ్యత తీసుకోవాలని సూచించారు. సంక్షేమ పథకాల విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. సంక్షేమ పథకాలు అందని వారి వివరాలను పక్కాగా నమోదు చేసుకోవాలన్నారు.

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు చేస్తున్న మంచిని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో జేసీఎస్ ఇన్‌చార్జి ఎస్.మోహన్, నాయకులు బి.రామకృష్ణ, సీహెచ్.అప్పన్న, ఎస్.గణపతిరావు, జి.భాను, నర్సింహమూర్తి, జి.గణేష్, పి.సిమ్మన్న, ఎస్.ధనుంజయరావు,జి.శ్రీను, వలంటీర్లు పాల్గొన్నారు.

వారివి మతిలేని మాటలు

- వైఎస్సార్‌సీపీ నాయకుల ధ్వజం


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మందస: తెలుగుదేశం పార్టీ నాయకులు గతి తప్పి, మతిలేని మాటలు ఆడుతున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. మందసలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, వైస్ ఎంపీపీ సీర ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు అగ్గున్న సూర్యారావు, బాలిగాం పీఏసీఎస్ చైర్మన్ సార్ర ఢిల్లేశ్వరరావు మాట్లాడారు. ఎక్కడ ఏది జరిగినా వైఎస్సార్‌సీపీపై బురద జల్లడం టీడీపీ వారికి ఫ్యాషన్ అయిపోయిందన్నారు. ఆ పార్టీ నాయకురాలు యార్లగడ్డ శిరీష కేవలం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై ఆరోపణలు చేయడానికే సమయమంతా కేటాయిస్తున్నారన్నారు. ఇటీవల కాశీబుగ్గలో అకస్మాత్తుగా జరిగిన సంఘటనను ముందస్తు ప్రణాళికతో జరిగిందని ఆమె అవివేకంగా మాట్లాడుతున్నారన్నారు. మద్యం తాగిన టీడీపీ నాయకుడు ఇష్టానురాజ్యంగా మాట్లాడుతుంటే అక్కడి వారు అడ్డుకోగా, ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగిందన్నారు. దీనికి మంత్రి సీదిరి అప్పలరాజుకు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. ఇదేదో జాతీయ సమస్యలా సృష్టించడానికి ఆమె చేసిన ప్రయత్నాలు బెడిసి కొట్టాయన్నారు. స్వాతంత్ర్యయోధుల వారసురాలిగా చెప్పుకొంటూ, మహాత్మాగాంధీ అహింసావాది అని తెలియని అవివేకంలో ఉన్నారన్నారు. గాంధీ విగ్రహం ఎదుట నాలుగు మంచిమాటలు చెప్పి.. ఆదర్శంగా నిలవాల్సిందిపోయి మంత్రి భార్యపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఏమిటన్నారు. కొడతాం, తిడతాం, తలలు పగలగొడతాం.. అంటూ రంకెలు వేయడం సరికాదన్నారు. సభ్య సమాజం అంగీకరించని విధంగా శిరీషా ప్రవర్తిస్తున్నారన్నారు. ఎన్నికల అనంతరం ప్రకాశం లేదా విశాఖ జిల్లాకు వెళ్లిపోవడం తథ్యమన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఈ తరుణంలో ఓర్వలేని టీడీపీ నాయకులు అసందర్భ ప్రేలాపనలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మహిళలపై అనుచిత వ్యాఖ్యలు

జెడ్పీటీసీ సభ్యురాలు సవర చంద్రమ్మ, కొత్తపల్లి సర్పంచ్ సేనాపతి దివ్య మాట్లాడుతూ.. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం టీడీపీ నాయకులకు తగదన్నారు. రాజకీయాలతో ఏమాత్రం సంబంధం లేని మంత్రి అప్పలరాజు సతీమణిపై శిరీష వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సర్పంచ్‌లు గేదెల పద్మనాభం, తలగాన చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యులు మట్ట లక్ష్మమ్మ, సవర ఢిల్లేశ్వరి, వైఎస్సార్‌హెచ్‌యూ బోర్డు మెంబరు బత్తిని లక్ష్మీనారాయణ, పార్టీ నాయకులు దున్న హరికృష్ణ, సవర బాలకృష్ణ, గున్న నారాయణ, రౌతు దుర్యోధన పాల్గొన్నారు.

లొద్దభద్రలో ఇంటింటికీ పలకరింపు

కాశీబుగ్గ: లొద్దభద్రలో ఇంటింటికీ పలకరింపు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. గ్రామ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కొత్తపల్లి చిన్నాచారి ఆధ్వర్యంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అర్హులైనవారు ఎవరైనా ఇంకా మిగిలి ఉంటే తక్షణమే దరఖాస్తు చేసుకుంటే పథకాలు అందుతాయని అన్నారు. నాయకులు మామిడి వీర్రాజు, పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్ తామరాశెల్లి ఫ్రాన్సెస్, లండ జోగారావు, గృహసారథులు కొయ్యి తిరుపతి, డొక్క రాజేశ్వరి, సీఎఫ్ రమాదేవి, వలంటీర్లు రత్నాల మౌనిక, పల్లవి పాల్గొన్నారు.

పశుదాణా పంపిణీ

మందస: హరిపురం, మందస పశు వైద్య కేంద్రాల్లో సోమవారం సంపూర్ణ మిశ్రమ పశుదాణాను పాడి రైతులకు పంపిణీ చేశారు. డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్, డాక్టర్ కిల్లి ఉమాభారతి ఆధ్వర్యంలో సబ్సిడీపై వీటిని అందజేశారు. కిలో దాణా రూ.15.80లు కాగా, సబ్సిడీపై కేవలం రూ.6.50లకే అందజేస్తున్నట్టు పశు వైద్యాధికారులు తెలిపారు. కావాల్సిన రైతులు సమీపంలోని రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. సిబ్బంది నల్ల ధర్మేంద్ర, సీహెచ్ ప్రసన్న, సంతోషి, శ్రీను, కల్యాణ్, హరికృష్ణ, లక్ష్మి, పార్వతి, భాస్కరరావు, నేతాజీ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

జీడి రైతుల బైక్ ర్యాలీ


ర్యాలీ చేస్తున్న జీడి రైతులు

కాశీబుగ్గ: జీడి పిక్కలకు మద్దతు ధర ప్రకటించాలని కోరుతూ రైతులు బైకు ర్యాలీని సోమవారం చేపట్టారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనారి మోహనరావు, జీడి రైతు సంఘం కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్‌లు ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



కవిటి: బిగొనవపుట్టుగ జెడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా సోమవారం నిర్వహించిన క్రీడా పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పీఈటీ బల్లెడ రమేష్ ఆధ్వర్యంలో కబడ్డీ, హైజంప్, లాంగ్‌జంప్, రన్నింగ్ పోటీలను నిర్వహించారు.

హైజంప్ చేస్తున్న బాలిక

వరుణుడి కోసం శివాలయంలో పూజలు


జలాభిషేకం కోసం బిందెలతో నీటిని తెచ్చిన రైతులు

సోంపేట: వర్షం కురవాలని కోరుతూ జింకిభద్ర నీలకంఠేశ్వర స్వామి దేవాలయంలో రైతులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగానికి జలాభిషేకం నిర్వహించారు. సర్పంచ్ తామాడ పద్మావతి, ఉపసర్పంచ్ సాహుకారి జాని పాల్గొన్నారు.

నేడు ఆహా క్యాంటీన్ ప్రారంభం

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి సమీపంలో ఆహా క్యాంటీన్‌ను మంగళవారం ప్రారంభిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ మెప్మా వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాంటీన్‌లో తక్కువ ధరకే రుచికరమైన భోజనం అందించనున్నట్లు చెప్పారు.

వాహనాల తనిఖీ

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి తెంబూర్ రోడ్డు జంక్షన్ వద్ద ఎస్సై రామకృష్ణ తన సిబ్బందితో కలిసి సోమవారం వాహనాలను తనిఖీ చేశారు.

రుణాలను సక్రమంగా చెల్లించాలి

మందస: మహిళా సంఘాలు ఉన్నతి రుణాల రికవరీలను వాయిదా పద్ధతిలో సక్రమంగా కట్టుకోవాలని సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు అన్నారు. గిరిజన ప్రాంతమైన రామరాయి, గోపిటూరు గ్రామాల్లో సోమవారం గిరిజన మహిళలలో అవగాహన సదస్సు నిర్వహించారు.

31న పురపాలక సంఘం సాధారణ సమావేశం

ఇచ్ఛాపురం: మున్సిపల్ సాధారణ సామావేశాన్ని ఈ నెల 31వ తేదీన నిర్వహిస్తున్నట్టు చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

బాలికలకు ఆరోగ్య పరీక్షలు

ఇచ్ఛాపురం రూరల్: కిశోర బాలికలు ఆరోగ్యపరంగా ఇబ్బందులు పడకుండా వారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. సీనియర్ ఏఎన్ఎం కరుణశ్రీ అన్నారు. లొద్దపుట్టి జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలికలకు రక్త పరీక్షలు సోమవారం నిర్వహించారు.

తక్షణ సాయం అందజేత

ఇచ్ఛాపురం రూరల్: కేదారిపురం గ్రామానికి చెందిన సున్నాముద్ది జయసాహూ ఇటీవల మృతి చెందింది. వైఎస్సార్ బీమా కింద పది వేల రూపాయల తక్షణ సాయం మంజూరైంది. ఈ మొత్తాన్ని ఆమె భర్త నేతాజీకి స్థానిక సర్పంచ్ నీలాపు సారధిరెడ్డి సోమవారం అందజేశారు.

క్రీడా స్ఫూర్తిని అలవర్చు కోవాలి

ఇచ్ఛాపురం: విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శివప్రసాద్ అన్నారు. పురపాలక సంఘం పరిధి పురుషోత్తపురం ఆదర్శపాఠశాల ఆవరణలో నియోజకవర్గంలోని నాలుగు ఆదర్శ పాఠశాలల విద్యార్థులకు క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐదు రోజులుగా అంతరపాఠశాలల క్రీడా పోటీలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమం సోమవారం జరిగింది.

గద్దర్‌కు ఘనంగా నివాళి

కంచిలి: ప్రజా గాయకుడు గద్దర్‌కు జాడుపూడిలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ నేత పలికల జయరాం, మాజీ సర్పంచ్ పిలక చిన్నబాబు, కళాకారులు హేమసుందర్‌రావు, గ్రామస్తులు బూరగాపు లక్ష్మణ్, శివ, ప్రవీణ్ పాల్గొన్నారు.

శానిటేషన్ సమస్య లేకుండా చర్యలు

కాశీబుగ్గ: పారిశుద్ధ్య సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ అన్నారు. చెత్త ఎక్కడైనా పేరుకుపోతే తమ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలన్నారు. పాతజాతీయ రహదారిపై ఉన్న టువంటి చెత్తకుప్పలను నూతన కాంపెక్ట్ వాహనంతో ఎత్తించే ప్రక్రియను సోమవారం పరిశీలించారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శివరామలక్ష్మి పాల్గొన్నారు.

నేడు కవ్వం పుస్తకావిష్కరణ

కాశీబుగ్గ: పట్టణంలోని గణపతి లాడ్జిలో మంగళవారం ఉదయం పదిన్నర గంటలకు 'కవ్వం' పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్టు కళింగసీమ సాహితీ సంస్థ ప్రతినిధులు సోమవారం తెలిపారు. పుస్తకాన్ని వి.రాజారావు రాశారన్నారు. కార్యక్రమానికి డాక్టర్ మల్లేశ్వరరావు, డాక్టర్ తెప్పల ఆనందరావు ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు.